క్లుప్తంగా

వేపలసింగారంలో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అన్నెం శిరీష

హుజూర్‌నగర్‌రూరల్ : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని వేపలసింగారంలో అరుణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కోదాడ వారి సౌజన్యంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈసీజీ, జనరల్ సర్జన్, పీడియాట్రిక్ డాక్టర్లతో ఉచిత వైద్యం అందించినట్లు తెలిపారు. 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ కొండ రాంబాబు, అన్నెం కొండారెడ్డి, గ్రామ పెద్దలు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు గ్రామంలో..

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరులో హైదరాబాద్‌కు చెందిన కామినేని వైద్య బృందం గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ పల్లెపంగ నాగరాజు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నందిపాటి నాగవేణిగురువయ్య, కార్యదర్శి పద్మ, మాజీ సింగిల్ విండో చైర్మన్ కరుణాకర్‌రావు తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

నడిగూడెం : నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని గురువారం నడిగూడెంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్, మండల అధ్యక్షుడు జమ్మి యల్లయ్య వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలలో నిరుద్యోగ భృతి ఉందని, ప్రభుత్వం స్పందించి తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

‘డబుల్’ లబ్ధిదారుల జాబితా ఇవ్వాలని వినతి

మోతె : మోతె గ్రామంలో ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల జాబితా ఇవ్వాలని ఏఐయూడబ్ల్యూఈసీ జిల్లా చైర్మన్ దోసపాటి చిరంజీవి గురువారం మోతె తహసీల్దార్ ప్రకాష్‌రావుకు సమాచార హక్కు చట్టం -2005 ద్వారా వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ చిన వెంకటరెడ్డి, బొక్క లింగారెడ్డి ఉన్నారు.

ఆర్మ్ జాతీయ మహాసభలకు ప్రతినిధిగా బాలునాయక్

మఠంపల్లి : మండలంలోని కిందితండాకు చెందిన తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మాళోతు బాలునాయక్ ఈనెల 19న తమిళనాడు రాష్ట్రం నమ్మక్కల్ జిల్లా కేంద్రంలో జరిగే ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ (ఆర్మ్) జాతీయ 4వ మహాసభలకు ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం బాలునాయక్ మండల కేంద్రంలో విలేకరులతో తెలిపారు. ఆయన వెంట సంఘం నాయకులు వినోద్, శంభయ్య తదితరులు ఉన్నారు.

పంట రుణాలు సకాలంలో చెల్లించాలి

మఠంపల్లి : పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించి వడ్డీ లబ్ధి పొందాలని మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, జెడ్పీటీసీ జగన్‌నాయక్, ఎన్‌డీసీసీ బ్యాంక్ మేనేజర్ విజిత కోరారు. గురువారం మండలంలోని భీల్యానాయక్‌తండాలో గిరిజన రైతులకు ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీ శౌరీనాయక్, సర్పంచ్ గోవిందునాయక్, ఉపసర్పంచ్ సైదులు, కోటానాయక్, ఫీల్డ్ ఆఫీసర్ బాలకృష్ణ, సీఈఓ తిరుపతయ్య, నాయకులు బొజ్జానాయక్, పకీరా, బాలు, నగేష్, రంగా రైతులు ఉన్నారు.

సైదిరెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

నేరేడుచర్ల : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హుజూర్‌నగర్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ ఎన్నికల ఇన్‌చార్జ్ కొణతం సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ కార్యాలయంలో జరిగిన మున్సిపాలిటీ పరిధిలోని నూతన 15 వార్డుల బూత్ కమిటీల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టణ ఎన్నికల పరిశీలకులు మన్సూర్ అలీ, మున్సిపల్ చైర్మన్ జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, మత్స్య సొసైటీ చైర్మన్ వీరయ్య, కౌన్సిలర్లు బాషా, సరితసైదిరెడ్డి, సాయి, లలితభరత్, నాగవేణి నారాయణ, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి సైదులు, నాయకులు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నియోజకవర్గ స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నడిగూడెం : క్రీడల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీ కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కోదాడ నియోజకవర్గ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. క్రీడలతో కూడిన పరిపూర్ణత విద్యకు చిరునామా ప్రభుత్వ పాఠశాలలని, క్రీడల్లో విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములను విద్యార్థులు సమానంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, మండల విద్యాధికారి ఎం డి.సలీం షరీఫ్, ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆజీంబాబా, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, వ్యాయామ అధ్యాపకుల సంఘం డివిజన్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడు పాతకొట్ల ప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు పుట్టా రమేష్, గోసుల రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంపద వనాల పనులు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ ప్రియాంక



మునగాలలో సంపద వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

మునగాల : జిల్లా వ్యాప్తంగా 256 ఎకరాల్లోని 115 బ్లాకుల్లో ఏర్పాటు చేయనున్న సంపద వనాల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. గురువారం మునగాల గ్రామపంచాయతీ శివారులోని ఎస్ఎస్పీ కాలువ కట్టపై ఇటీవల ఏర్పాటు చేసిన సంపద వనాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగాల మండలంలో 34 ఎకరాలకలో సంపద వనాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా సంపద వనాల ఏర్పాటును పూర్తిచేయాలని ఆమె మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఆదేశించారు. అనంతరం నారాయణగూడెం, కృష్ణానగర్‌లో గల పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆమె వెంట ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మీపతిరావు, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి శ్రీధర్, నీటిపారుదల శాఖ ఏఈ సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ వసంత, ఉపాధి హామీ ఏపీఓ శైలజ, ఈసీ కళ్యాణ్, టీఏ శేఖర్, శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్లు నారగాని కృష్ణవేణి, సులోచన, వీరయ్య, సర్పంచ్‌లు చింతకాయల ఉపేందర్, గోపిరెడ్డి వెంకటరెడ్డి, వి.లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్వేత ఉన్నారు.

మనీషా కుటుంబానికి అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



మనీషా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

గరిడేపల్లి : ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన బిల్లా మనీషా కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని కల్మలచెరువులో బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు మీసాల యోహాన్, సర్పంచ్ విజయ సీతారాంరెడ్డి, నాయకులు సీతారాంరెడ్డి, బచ్చలకూరి మట్టయ్య, సత్యనారాయణరెడ్డి, నగేష్, అనీల్ రెడ్డి, ఆదిరెడ్డి, కృష్ణ, జి.వెంకట్‌రెడ్డి, గోవింద్, మంగయ్య, సైదులు, మట్టయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పద్మావతి పరామర్శ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉద్యోగి దున్నా లింగయ్య (63) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. దీంతో కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లింగయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నడిగూడెంకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గుండు మహేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయన్ని పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు పందిరి వెంకటరెడ్డి, ప్రతాపరెడ్డి, వేపూరి సుధీర్, పల్లపు శ్రీను, మౌలానా, మోసెస్, వెంకన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

కోదాడ : విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి చదువు ఎంతో ఉపయోగపడుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. గురవారం కోదాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఎస్‌కె.మదీహ తబ్బసుం, ఆసియా సోగోరాలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో వంగవేటి రామారావు, బాల్‌రెడ్డి, బాబా, షమ్మీ, గురునాథం, ఆక్స్‌ఫర్డ్ పాషా, గురుమూర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలి

మఠంపల్లి : హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో ఈనెల 17న కాంగ్రెస్ అధినాయకత్వం సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ముఖ్య అతిథిలుగా పాల్గొనే కాంగ్రెస్ పార్టీ విజయభేరీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ కోరారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో సభకు తరలివెళ్తామన్నారు. ఆయన వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వల్లపుదాసు దుర్గయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సోనియా గాంధీ సభను విజయవంతం చేయాలి

నడిగూడెం : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల 17న జరగనున్న సోనియా గాంధీ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి వేపూరి సుధీర్, నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు సోమయ్య, గోవర్ధన్, నాగరాజు, గోపి, లింగరాజు, హుస్సేన్, కిట్టు, గోపి, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కోదాడ : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను ప్రభుత్వం భగ్నం చేయడాన్ని నిరసిస్తూ గురువారం కోదాడలోని రంగా థియేటర్ సెంటర్‌లో బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తవుతున్నా ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా కేసీఆర్ మోసం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సాతులూరి హనుమంతరావు, అక్కిరాజు యశ్వంత్, యాదా రమేష్, వంగవేటి శ్రీనివాసరావు, రవికుమార్, వెంకటేష్, నగేష్, పిడతల శంకర్రావు, కోటకొమ్ముల భాగ్యలక్ష్మి, పెనుగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

హుజూర్‌నగర్ : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కార్యకర్తలు ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించి రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, నాయకులు అట్లూరి హరిబాబు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, అమర్ గౌడ్, దొంతిరెడ్డి పద్మ రాంరెడ్డి, ప్రదీప్ గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై దాడులు చేస్తే ఊరుకోం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాంబశివగౌడ్

హుజూర్‌నగర్ : అగ్రవర్ణాల నాయకులు బీసీలపై దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దేశగాని సాంబశివగౌడ్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా ఎదుగుతున్న బీసీ బిడ్డ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌పై అగ్రవర్ణాలకు చెందిన నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తరతరాలుగా ఆధిపత్య కులాలు బహుజనులపై రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పెత్తనం చెలాయిస్తూనే ఉన్నాయన్నారు. జనాభాలో 93 శాతం ఉన్న బహుజనులు వారిలో 56 శాతం ఉన్న బీసీలను రాజకీయంగా అణచివేస్తూ, ఎలాంటి అవకాశాలు రాకుండా అగ్రవర్ణాల వారు అడ్డుపడున్నారని ఆయన ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎంపీపీని ఫోన్‌లో పరామర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీనివాస్, భిక్షపతి గౌడ్, జిల్లా మహిళా కన్వీనర్ వి.నాగమణి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సబ్బుగౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రులను ఘనంగా జరుపుకోవాలి



హుజూర్‌నగర్ : కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎస్ఐ హరికృష్ణ



కోదాడ : మట్టి విగ్రహాలను పరిశీలిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : గణేష్ నవరాత్రులను ఘనంగా జరుపుకోవాలని తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎస్ఐ హరికృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేష్ మండపాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్, విద్యుత్ శాఖల నుంచి అనుమతి తీసుకుని గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు, గణేష్ మండపాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం

కోదాడ : పర్యావరణహితంగా ఉండే మట్టి గణపతి విగ్రహాలను పూజిద్దామని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. గురువారం కోదాడలో తయారవుతున్న మట్టి విగ్రహాలను కమిటీ సభ్యులు పరిశీలించి మాట్లాడారు. భక్తులు మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, మట్టి విగ్రహాల తయారీదారులను ప్రోత్సహించాలని వారు కోరారు. కార్యక్రమంలో కొమరగిరి రంగారావు, బొలిశెట్టి కృష్ణయ్య, సాతులూరి హనుమంతరావు, రవికుమార్, అంబడికర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి

నేరేడుచర్ల : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని నేరేడుచర్ల ఎస్ఐ పచ్చిపాల పరమేష్ అన్నారు. గురువారం నేరేడుచర్లలో జరిగిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సురేష్‌బాబు, కల్లూరు సర్పంచ్ నాగరాజు, నాయకులు వెంకటేశ్వర్లు, జగతయ్య, గురువయ్య, సుదర్శన్ ఉన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

మఠంపల్లి : వినాయకుడి మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ సీహెచ్ బాలకృష్ణ అన్నారు. గురువారం మఠంపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందిన తరువాతనే మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ సమ్మె

హుజూర్‌నగర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం దిగిపోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 34 రోజులు సమ్మె చేసిన జీపీ కార్మికులతో మంత్రి దయాకర్‌రావు మీ సమస్యలు 15 రోజుల్లో పరిష్కరిస్తామని అని చెప్పడంతో మంత్రి మాట గౌరవించి సమ్మెను తాత్కాలికంగా విరమించారని, కానీ హామీ ఇచ్చి నెల రోజులు అవుతోందని అన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే మళ్లీ సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు పి.హుస్సేన్, జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు హుసన్‌మియా, వెంకటరెడ్డి, రత్నం, చంటి, రామకృష్ణ, నాగరాజు, వెంకటేశ్వర్లు ఎల్లమ్మ, సరిత, శ్రావణి, మరియమ్మ, సైదులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్ష



మునగాల : దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హుజూర్‌నగర్/కోదాడరూరల్/ చిలుకూరు/నేరేడుచర్ల / మునగాల : ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ కోదాడ, హుజూర్‌నగర్, చిలుకూరు, నేరే డుచర్ల, మునగాల మండల కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం చేస్తామన్నారు.

మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలి



ఉత్తమ వీఓఏను సన్మానిస్తున్న ఎంపీపీ కవిత

కోదాడరూరల్ : ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళా సంఘాలు స్వయం సమృద్ధి చెందేవిధంగా వారికి అవగాహన కల్పించాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని ఏపీఎం కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు చేసిన సర్వజన మహాసభ సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన వీఓఏలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం వీరబాబు, వీఓఏలు, ఈసీ సభ్యులు ఉన్నారు.

చిన్నారి కుటుంబానికి ఎంపీపీ పరామర్శ

కోదాడరూరల్ : మండలంలోని రామలక్ష్మీపురంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన చిన్నారి బిట్టు మృతదేహాన్ని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులు వెంకటనారాయణ, శిరీషతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు అన్నెం వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ బుచ్చమ్మ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి, రమేష్, రామయ్య, లచ్చయ్య ఉన్నారు.

ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మునగాల : నిత్యావసర ధరలు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారం మోపుతున్నాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయిల నవీన్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిశోర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండటంతో రోజురోజుకు నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జమ్మి ఎల్లయ్య, మండల కమిటీ సభ్యుడు దేవరం శ్యాం సుందర్‌రెడ్డి, బత్తిని ఉమాశంకర్ పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి

కోదాడ : పట్టణ సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం బైపాస్ రోడ్డు నుంచి ఊరి మధ్య వరకు ఉన్న వరద కాలువను పరిశీలించారు. కాలవను ఆధునీకరించి గ్రామానికి వరద ముప్పు లేకుండా చేస్తామని, దీని కోసం ప్రణాళికలు తయారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రశేఖర్, వనపర్తి లక్ష్మీనారాయణ, శివయ్య, శేఖర్, అంజలి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

చిలుకూరు : అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సరిత అన్నారు. గురువారం చిలుకూరులో ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు గుర్తింపు కార్డులో తప్పులుంటే సరిచేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు మంజుల, సీతయ్య, బీఎల్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘చెక్ యువర్ ఓటు’లో చూసుకోవచ్చు

హుజూర్‌నగర్ : ‘చెక్ యువర్ ఓటు’ ద్వారా ఓటు జాబితాలో ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చని తహసీల్దార్ నాగార్జునరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం స్వీప్‌లో భాగంగా చెక్ యువర్ ఓటును ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పట్టణానికి చెందిన పలువురు ఓటర్లు వారి ఓట్లను సరి చూసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు షరీఫ్, సూర్యనారాయణ, సిబ్బంది ఎం.శ్రీనివాస్, మోహన్, విజయ్ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు సాధించాలి

మునగాల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరులైన పోరాట యోధుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు కోరారు. గురువారం మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన అమరవీరుల వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య, గ్రామ కార్యదర్శి నందిగామ సైదులు, పార్టీ సభ్యులు ములకలపల్లి సైదులు, వట్టెపు చినసైదులు, బ్రహ్మం, రావులపెంట వెంకన్న, శ్రీను, నిదిగొండ శంభయ్య పాల్గొన్నారు.

మట్టపల్లిలో నృసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, గర్భాలయంలోని శ్రీమూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం మాంగల్యధారణ నిర్వహించారు. ఆలయ అనువంశిక చైర్మన్ మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాబాచార్యులు, నారాయణాచార్యులు, మంగాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

స్థలం వివాదంలో ఇద్దరికి గాయాలు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గుట్ట వద్ద జరిగిన స్థలం వివాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థలంలో పలు కట్టడాల విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడంతో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

నేడు విధుల బహిష్కరణ

హుజూర్‌నగర్ : ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామలో న్యాయవాది కోట రాజుపై దురుసుగా ప్రవర్తించిన నందిగామ రూరల్ సీఐ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలపాలని నిర్ణయించినట్లు హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ పీఆర్‌ఓ కాల్వ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. న్యాయవాదుల విధుల బహిష్కరణకు ప్రాసిక్యూషన్ తరఫున పోలీసులు, న్యాయ శాఖ సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు.

ఇంటికో మనిషి తరలి రావాలి

చిలుకూరు : కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించబోయే మహాధర్నాకు ఇంటికో మనిషి, ఊరికో బండి తరలిరావాలని కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు, గీత కార్మికులు తండ రమేష్, నోముల వెంకన్న, సైదులు, ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, మరీదు సైదులు, రవి, కోటయ్య, అర్జున్ పాల్గొన్నారు.

నైజాంకు ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులే



అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణలో నైజాం, దొరల దురాగతాలను ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లో అమరవీరుల స్థూపంపై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, యల్లావుల రమేష్, సత్యనారాయణ, రమేష్, వెంకయ్య, వెంకన్న, కృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర



ప్రభ బండ్లు ఊరేగిస్తున్న గ్రామస్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో కనకదుర్గమ్మ జాతరను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆది, సోమవారాల్లో ముత్యాలమ్మ జాతర జరిగిన తర్వాత గురువారం కనకదుర్గమ్మ జాతర జరుపుకోవడం ఇక్కడి ఆచారం. భక్తులు ప్రభ బండ్లు కట్టి ఆలయం చుట్టూ తిప్పి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్ఐ హరికృష్ణ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.